సాక్షి
ఖమ్మం
శనివారం, 26, ఆగస్టు, 2023



ఉద్యమాలు విస్తృతపరచండి

ప్రజాసమస్యలను పాలకులు పరిష్కరించేలా ఉద్యమాలు విస్తృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సూచించారు. 8లో



1న చలో హైదరాబాద్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 1న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు యూఎస్‌పీసీ నాయకులు తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి పువ్వాడ



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరా బాద్‌లో శుక్రవారం సీఎంను కలిసిన ఆయన ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంపై పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తమేడేపల్లిని సందర్శించిన న్యాయమూర్తి



జడ్జికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఏన్కూరు: మండలంలోని కొత్తమేడేపల్లి గ్రామాన్ని న్యాయమూర్తి ఆశారాణి శుక్రవారం సందర్శించారు. గ్రామంలో మౌలిక వసతులు, సమస్యలపై స్థానిక గిరిజనుల నుంచి ఆరా తీశారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేకపో గా, విద్య, వైద్యం అందడం లేదని, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని గిరిజను లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాదావత్ రవి, గ్రామస్తులు గంగరాజు, దుగ్గి కృష్ణ, గంగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవ ర్చుకుని ఉన్నత లక్ష్యంతో చదవాలని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయని జిల్లా ఇంటర్‌మీడి యట్ విద్యాశాఖాధికారి రవిబాబు సూచిం చారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కళాశాలలో సౌకర్యాలను పరిశీ లించడమే కాక ఎస్‌ఎంహెచ్ హాస్టళ్లలో అందు తున్న ఆహారంపై ఆరా తీశారు. వారానికోసారి హాస్టళ్లను తనిఖీ చేయాలని ప్రిన్సిపాల్ భాగ్యల క్ష్మిని ఆదేశించారు. అనంతరం శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సులపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లా డారు. వృత్తివిద్యా కోర్సులు పూర్తయిన తర్వా త మెరుగైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మ మంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న 'నిధి ఆప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) ఆధ్వర్యాన జరి గే ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలు వెల్ల డించవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసు లు కల్లూరులోని లార్జ్‌సైజ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లావాసు లు ఇల్లెందు మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగే కార్య క్రమానికి హాజరుకావాలని సూచించారు.

మెడికల్ కళాశాలలో 32 పోస్టులు



ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వమెడి కల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 32 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, సెంట్రల్ లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్, ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరిం టెండెంట్ కార్యాలయాలు,మెడికల్ ఎడ్యుకే షన్ విభాగాల్లో అవసరమైన పోస్టులు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 32 పోస్టులు ఉండగా, ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా పోస్టుల్లో ఏడాది అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వాసులను రిజర్వేషన్ ఆధారంగా నియమిస్తామని తెలిపారు.

కమలం.. కసరత్తు



ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానంలో సిద్ధమవుతున్న సభావేదిక

రేపటి అమిత్ షా సభకు ముమ్మర ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మందిని తరలించేలా ప్రణాళిక
- ఏర్పాట్లను పరిశీలించిన ఈటల.. ముఖ్యనేతలకు దిశానిర్దేశం
- రైతులకు భరోసా ఇచ్చేలా సభ ఉంటుందని వెల్లడి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈటల రాజేందర్, నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గతంలో రెండుసార్లు వాయిదా పడుతూ వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మం జిల్లా పర్యటన ఎట్టకేలకు ఖరారైంది. ఖమ్మం లోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఈమేరకు స్టేజీ నిర్మాణంతోపాటు బారికేడ్లు, ఫ్లెక్సీల ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి లక్ష మంది వరకు తరలించేలా పార్టీ వర్గాలు కార్యాచరణ రూపొందిం చాయి. సభకు ఒకరోజు మాత్రమే గడువు ఉండటం తో పార్టీ ముఖ్య నేతలంతా ఖమ్మంలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఖమ్మం వచ్చిన బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సభా ఏర్పాట్లను పరిశీలించడమే కాక జన సమీకరణపై ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఏర్పాట్లపై నజర్..

అమిత్‌షా సభకు ఒకరోజు మాత్రమే సమయం ఉం డటంతో ఏర్పాట్లలో వేగం పెంచారు. ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో స్టేజీ నిర్మాణం, బారికేడ్ల ఏర్పాటు పనులు చివరి దశకు చేరాయి. సభా మైదానాన్ని ఎంపిక చేసేందుకు గత వారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఖమ్మం రాగా.. సూచనలు చేశారు. ఇంతలోనే గురువారం అమిత్ షా పర్యటనకు సంబంధించి షెడ్యూల్ విడుదలైం ది. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇక్కడే మకాం వేసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

లక్ష మందిని తరలించాలని..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్ష మంది జనాన్ని తరలిం చి సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయ కులు భావిస్తున్నారు. ఇందుకోసం రెండు జిల్లాల నాయకత్వానికి బాధ్యతలు అప్పగించగా.. జన సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత రెండు పర్యాయాలు వాయిదా పడిన క్రమంలో ఈసారి నేతలు తొలుత ఏర్పాట్లపై దృష్టి సారించలేదు. కానీ అమిత్‌షా పర్యటన షెడ్యూల్ విడుదల కావడం తోనే వేగం పెంచారు. సభా ప్రాంగణంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కటౌట్లు ఏర్పాటు చేస్తుండగా, నగరమంతా బీజేపీ జెండా లు, కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

రైతుకు భరోసా ఇచ్చేలా..

ఖమ్మంలో ఆదివారం జరిగే సభ రైతులే అజెండాగా ఉంటుందని నాయకులు చెబుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచార సభగానే భావిస్తున్నారు. ప్రజలకు హామీలు ఇప్పించడమే కాక బీజేపీ అధికారంలోకి వస్తే రైతుల కోసం అమలుచేయ నున్న పథకాలను అమిత్‌షాతో చెప్పించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. రైతులకు భరోసా ఇచ్చే లా సభ ఉంటుందని ఇప్పటికే ఈటల రాజేందర్ ప్రకటించారు. దీంతో సభకు రైతులను పెద్ద ఎత్తున తరలించి.. వారిని ఆకట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. బీజేపీ ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో చూస్తే కేంద్ర మంత్రి హోదాలో పార్టీ అగ్రనాయక త్వం ఖమ్మం సభకు రావడం ఇదే తొలిసారి అవు తుంది. ఈ సభావేదికగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పార్టీల నుంచి నేతల చేరిక ఉంటుందని తెలిసింది.

పట్టు కోసం ప్రయత్నాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టు సాధించేం దుకు బీజేపీ అగ్రనాయకత్వం పట్టుదలతో ఉంది. నాలుగేళ్లుగా ఉమ్మడి జిల్లాపై దృష్టి సారించగా.. కేంద్ర మంత్రులతోపాటు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పర్యటిస్తూ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ అన్ని స్థానాలకు బరిలో నిలిచి.. పట్టు సాధించాలన్న ఆలోచనలో ఆ పార్టీ అగ్రనాయకత్వం ఉంది. ఈ దిశగానే కార్యాచరణ రూపొందించి... కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సభ నిర్వహిస్తున్నారు. గతంలో రెండుసార్లు సభకు ఏర్పాట్లు చేసినా వివిధ కారణాలతో వాయిదా వేశారు. ఇప్పుడు మూడోసారి అమిత్‌షా పర్యటన ఖరారు కావడంతో సభను విజయవంతం చేయాలనే పట్టుదలతో జిల్లా నాయకత్వం ఉంది.




ఖమ్మంలోని ఆలయంలో సామూహికంగా వ్రతం ఆచరిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) అమ్మవారు

కోరితే చాలు వరాలు ఇచ్చే వరలక్ష్మీ దేవి వ్రతాన్ని మహిళలు జిల్లావ్యాప్తంగా ఆచరించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో పలు ఆలయాల్లో మహిళలు సామూహికంగా వ్రతం జరుపుకున్నారు. అలాగే, మరికొందరు ఇళ్లలో వ్రతం నిర్వహిం చారు. బంధువులను పిలిచి వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడంతో సందడి నెలకొంది.

ఘన స్వాగతం.. భారీ ర్యాలీ



వాహనాల ర్యాలీలో అభివాదం చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

- టికెట్ల ప్రకటన తర్వాత తొలిసారి జిల్లాకు 'తుమ్మల'
- మాజీ మంత్రికి అనుచరుల స్వాగతం, వందలాదిగా వాహనాలతో ర్యాలీ
- కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేకుండానే జెండాలు
- తెల్ల జెండాలపై కేవలం తుమ్మల ఫొటో మాత్రమే..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీమంత్రి తుమ్మల నాగేశ్వ రరావుకు పాలేరు టికెట్ రాకపోవడంతో ఆయన అనుచరుల్లో ఆగ్రహం ఇంకా చల్లారలేదు. అధిష్టానం పై అనుచరుల అసమ్మతి గళం తారాస్థాయికి చేరింది. ఈమేరకు టికెట్ల ప్రకటన తర్వాత తొలిసారి శుక్ర వారం జిల్లాకు వచ్చిన తుమ్మలకు ఆయన అనుచరు లు జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం వందలాదిగా కార్లు, బైక్‌లతో మధ్యాహ్నం 2గంటలకు నాయకన్‌గూడెం వద్ద ప్రారంభమైన ర్యాలీ సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని గొల్లగూడెం తుమ్మల ఇంటి వద్దకు చేరింది. మార్గమధ్యలో ఆయన వాహనం పైనుంచి అభివాదం చేస్తుండగా అభిమానులు పూలవర్షం కురిపించి జై తుమ్మల అంటూ నినదించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి అనుచరులు భారీగా రావడంతో తుమ్మల ఏ నిర్ణయం తీసుకుం టారనేది చర్చనీయాంశంగా మారింది.

తుమ్మల ఫొటోతో ప్రత్యేక జెండాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి సుమారు వెయ్యికి పైగా కార్లు, ద్విచక్ర వాహ నాలు, ఆటోల్లో అనుచరులు ఈ ర్యాలీకి వచ్చారు. ప్రతీ వాహనానికి ప్రత్యేకంగా తుమ్మల ఫొటో ఉన్న తెల్ల రంగు జెండాలు కట్టారు. ఎక్కడ కూడా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు కానీ బీఆర్‌ఎస్ జెండాలు కానీ కనిపించలేదు. కొందరు తుమ్మల ఫొటో ఉన్న జెండా లతో పాటు కాంగ్రెస్ జెండాలు కూడా పట్టుకోవడం కనిపించింది. నాయకన్‌గూడెం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై పాలేరు, కూసుమంచి, జీళ్లచెర్వు, తల్లం పాడు, కోదాడ క్రాస్‌రోడ్, నాయుడుపేట, కాల్వొడ్డు, పాత బస్టాండ్, జెడ్పీసెంటర్, రోటరీనగర్ మీదుగా గొల్లగూడెంలోని తుమ్మల ఇంటి వరకు కొనసాగింది. అయితే తుమ్మల ఈ ర్యాలీలో అభివాదం చేస్తూ కొన సాగారే తప్ప ఎక్కడా మాట్లాడలేదు.

మీపై నమ్మకం ఉంది...

హైదరాబాద్‌లో ఇంటి నుంచి బయలుదేరే సమయం లో అక్కడ ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో మాట్లాడిన తుమ్మల భావోద్వేగానికి గురయ్యారు. అలాగే, ఖమ్మంలో ర్యాలీగా గొల్లగూడెంలోని ఇంటికి చేరుకున్నాక అనుచరులను ఉద్దేశించి ఆయన మాట్లా డారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేది ఖాయమని వెల్లడించిన తుమ్మల... పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి ప్రాజెక్టుల్లోకి నీళ్లు నింపాక రాజకీయాల నుంచి సెలవు తీసుకుంటానని తెలిపారు. అధికా రం, అహంకారం అనుభవం కోసం తనకు పదవి అవసరం లేదని చెప్పారు. అలాగే, పరాన్న భుక్కులు రాజకీయంగా నష్టం చేసినా ప్రజలు, అభిమానులు ఆదరిస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. తుమ్మల వెంట ఆయన తనయుడు యుగేందర్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, జూపుడి రామా రావు, జొన్నలగడ్డ రవికుమార్, రామసహాయం వెం కటరెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రవేశాల కోలాహలం

మెడికల్ కాలేజీలో 69 మంది చేరిక



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాలు నానాటికీ పెరుగుతున్నాయి. శ్రావణ శుక్రవారం కావడంతో ఒకేరోజు ఎక్కువ మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి రావడం తో కాలేజీ ఆవరణ కోలాహలంగా కనిపించింది. రాష్ట్ర కోటాలో శుక్రవారం ఒకేరోజు 42మంది విద్యార్థులు చేరగా, జాతీయ కోటాలో ముగ్గురు విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇప్పటివరకు రాష్ట్ర కోటాలో 58 మంది, జాతీయ కోటాలో 11 మంది చేరారని, నెలాఖరు నాటికి 100 సీట్లు పూర్తిగా నిండుతాయని ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు తెలిపారు.

సెప్టెంబర్ 1 నుంచి ఇంట్రడక్షన్ తరగతులు

రాష్ట్రంలోని నూతన మెడికల్ కళాశాలలను సీఎం కేసీఆర్ సెప్టెంబర్ 1న వర్చువల్‌గా ప్రారంభించను న్నారు. ఖమ్మం కళాశాలను కూడా అదేరోజు ప్రారం భించనుండడంతో అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆరోజు నుంచి 11వ తేదీ వరకు విద్యార్థులకు ఇంట్ర డక్షన్ తరగతులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నే 8న కాలేజ్ విజిట్, 11వ తేదీన ఖమ్మం జనరల్ ఆస్పత్రి పరిశీలన ఉంటాయని, అక్టోబర్‌లో తరగతు లు మొదలవుతాయని అధికారులు తెలిపారు.

'వృక్షార్చన' ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

ఖమ్మంఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం హరిత హారంలో భాగంగా కోటి వృక్షార్చన పేరిట మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని వెలుగుమట్ల అటవీ పార్కులో ఏర్పా ట్లును శుక్రవారం డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ పరిశీలించారు. పార్కులో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ రాధిక, ఉద్యోగు లు వేణుమాధవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం

అదనపు కలెక్టర్ మధుసూదన్



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న అదనపు కలెక్టర్, ఉద్యోగులు


ఖమ్మం సహకారనగర్: ఇంటితో పాటు కార్యాలయం ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత దరిచేరుతుందని అద నపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. కలె క్టరేట్‌లో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా అధి కారులు, ఉద్యోగులతో కలిసి ఆయన కలుపు మొక్క లు, పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి తన కార్యాలయంలో, వెలుపల పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని చెప్పారు.

అదనపు కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ రెండు నెలల పాటు సెలవులో వెళ్లారు. దీంతో అద నపు కలెక్టర్(రెవెన్యూ) డి.మధుసూదన్ నాయక్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఈమేరకు కలెక్టర్ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేయగా, అభిలాష విధుల్లో చేరే వరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా మధుసూదన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఖమ్మం ఏసీపీగా హరికృష్ణ

- సీసీఆర్‌బీకి ప్రసన్నకుమార్



హరికృష్ణ

ఖమ్మంక్రైం: ఖమ్మం నగర ఏసీపీ గణేష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాచకొండ కమిషన రేట్ పరిధిలోని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్.వీ.హ రికృష్ణను నియమించారు. ఈమేరకు డీజీపీ అంజనీ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, గణేష్‌ను స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా బదిలీ చేశారు. పంజాగుట్ట ఏసీపీగా పనిచే స్తున్న గణేష్ ఏడాది క్రితం ఖమ్మం నగర ఏసీపీగా వచ్చారు. ఇక ఖమ్మం స్పెష ల్ బ్రాంచ్ ఏసీపీగా పనిచే స్తున్న ప్రసన్నకుమార్‌ను సైతం బదిలీ చేశారు. ఆయ నను ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సాగుకు సమస్య రాదు..

- జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు
- 3.18లక్షల మంది రైతులకు 'రైతుబంధు'
- జిల్లా వ్యవసాయాధికారి సరిత



తిరుమలాయపాలెం గోదాంలో పరిశీలిస్తున్న డీఏఓ సరిత

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగులో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి బి.సరిత వెల్లడించారు. జిల్లా కేం ద్రంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమా వేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు లక్ష్యం 7.09 లక్షలు కాగా, ఇప్పటి వరకు 4,94,053 ఎకరాల్లో పంటలు సాగయ్యాయని తెలిపారు. ఇందులో వరి 1,84,388 ఎకరాలు కాగా, పత్తి 1,80,456 ఎకరాల్లో, మిర్చి 11,415 ఎకరాల్లో సాగైందని, వరి, మిర్చి పంటల సాగు కొనసాగుతోందని వెల్లడించారు. పంటల సాగుకు అవసర మైన ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉన్నాయని తెలిపారు. డీలర్లు, సొసైటీల వద్ద 15,556 మెట్రిక్ టన్నులు నిల్వ ఉం దని, రిజర్వ్‌పూల్‌లో 400 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల వద్ద 70 మెట్రిక్ టన్నులు ఉండగా... మరో 400 మెట్రిక్ టన్నుల దిగుమతి అవుతోందని చెప్పారు. రైతులు ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా పర్యవేక్షి స్తున్నామని ఆమె తెలిపారు. ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని డీఏఓ హెచ్చరించారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని సూచించారు.

3.31లక్షల మందికి రైతుబంధు

జిల్లాలో ప్రస్తుత వానాకాలానికి సంబంధించి 3,31,809 మం ది రైతులకు రైతుబంధు నగదు జమ అయిందని డీఏఓ సరిత తెలిపారు. ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.364.48 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఇందులో శుక్రవారం వరకు 3,18,904 మంది రైతులకు రూ.330.72 కోట్లు జమ కాగా, ఇంకా 12,905 మంది రైతులకు రైతుబంధు జమ కావాల్సి ఉందని తెలిపారు. అలాగే, ఇప్పటి వరకు 76,651 మంది రైతులకు రుణమాఫీ వర్తించిందని, వారి ఖాతాల్లో రూ. 305.50 కోట్లు జమ అయ్యాయని, ఈ ప్రక్రియ కొనసాగు తోందని వెల్లడించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ టెక్ని కల్ ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల నిల్వలు పరిశీలన

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలో డీఏఓ సరిత పర్యటించారు. ఈ సందర్భంగా సహకార సం ఘం ఎరువుల కేంద్రాన్ని పరిశీలించి నిల్వలపై ఆరా తీశారు. మండలంలో అన్ని ప్రాంతాల్లో ఎరువుల నిల్వలు సరిపడా ఉన్నందున రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఏఓ సీతారాంరెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసరెడ్డి సిబ్బంది ఉండేటి దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తపాలా బీమా ఏజెంట్ల నియామకం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా బీమా పథకాలకు సంబంధించి తాత్కాలిక ప్రాతిపదికన ఏజెంట్లను నియమిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. కమీషన్ పద్ధతిలో నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసి 18 ఏళ్లు నిండిన నిరుద్యోగులు, గృహిణులు, అంగన్‌వాడీ సేవకులు, మహిళా మండళ్ల సేవకులు, మాజీ సైనికులు, రిటైర్డ్ ఉద్యోగులు, గ్రామీణ తపాలా సేవకులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సెప్టెంబర్ 25వ తేదీలోగా ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి మెమో, పాన్ కార్డు, ఆధార్ కార్డు ప్రతులను జతచేయాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు రూ.5 వేల నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్(ఎన్‌ఎస్‌సీ) లేదా కిసాన్ వికాస్ పత్రం(కేవీపీ) రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

బ్రాహ్మణపల్లికి వాసికి డాక్టరేట్


నవీన్

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన గంగసాని నవీన్‌కు కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'ఎడ్యుకేషనల్ ఇంటివేటివ్స్ క్యారీడ్ ఔట్ ఆఫ్ ఐటీడీఏ భద్రాచలం – ఏ స్టడీ' అంశంపై ఆయన ప్రొఫెసర్ గంటా రమేష్ పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించగా డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌ను మండల ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణమా?

- ఉపాధ్యాయుడి హత్య కేసులో చురుగ్గా విచారణ

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు(పీఈటీ) బైరోజు వెంకటాచారి ఈనెల 23న పాఠశాలకు వెళ్తూ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యాన విచారణ వేగవంతం చేశారు. ఘటనలో నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా, ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, వివాహేతర సంబంధం నేపథ్యంలోనే వెంకటాచారిని హత్య చేసినట్లు తెలుస్తోంది. నిందితులు హత్యకు ఉపయోగించిన కత్తులను సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాకత్‌గూడెంలోని ఓ చెరువులో వేయగా శుక్రవారం వెలికితీసినట్లు సమాచారం. త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

ప్రహరీ విషయమై ఘర్షణ

కారేపల్లి: ఇంటి ప్రహరీ విషయమై బంధువులు ఘర్షణ పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సూర్యతండాకు చెందిన భూక్యా హుస్సేన్, భూక్యా దిలీప్ అన్నదమ్ముల పిల్లలు. వీరి నడుమ ఇంటి ప్రహరీ విషయమై కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే దిలీప్ గురువారం రాత్రి మద్యం సేవించి హుస్సేన్ ప్రహరీని కూల్చివేశాడు. దీంతో ఇరువురి నడుమ గొడవ జరగగా దిలీప్ మద్యం మత్తులో హుస్సేన్‌పై కర్రతో దాడి చేయగా గాయాలయ్యాయి. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

భార్యపై దాడి.. కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్‌లో మహిళపై ఆమె భర్త దాడి చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన రాయల గోపీనాథ్ తన భార్య మానసపై దాడి చేయగా ఆమె కంటి దిగువన తీవ్ర గాయమైంది. మద్యానికి బానిసైన గోపీనాథ్ కొంతకాలంగా తనను వేధిస్తున్నాడని మానస చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: ఐటీఐలో ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన జోగ శ్రావణ్ (18) మహబూబాబాద్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఐటీఐలో ఫెయిల్ కావటంతో మనస్తాపం చెందాడు. ఒడ్డుగూడెం సమీపంలోని నీటి కుంటలో పడి మృతి చెందాడు. నాలుగేళ్ల కిందట శ్రావణ్ తండ్రి మృతి చెందాడు. నాటి నుంచి తల్లి పూర్ణిమ శ్రావణ్, తమ్ముడు యశ్వంత్‌ను కూలీ నాలీ చేసి చదివిస్తోంది. తండ్రి మృతి చెందిన తర్వాత వారు స్వగ్రామం లచ్చగూడెం నుంచి ఒడ్డుగూడెం చేరి రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,228	8,228
మిర్చి	19,600	13,000
ఏసీ మిర్చి	24,300	18,000
పత్తి	7,500	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,091

దేశానికి రక్షకుడు మోదీ..

- అమిత్‌షా పర్యటనకు తరలిరండి..
- బీజేపీ తమిళనాడు కోఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి/తల్లాడ: ప్రపంచంలోనే అత్యంత బలమైన, జనాదరణ గలిగిన దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ రక్షకుడిగా నిలుస్తున్నారని బీజేపీ తమిళనాడు కోఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో అసోం ఎమ్మెల్యే రామకృష్ణ ఘోష్, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మంలో ఆదివారం జరగనున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానుండగా, వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాగా, సీఎం కేసీఆర్ హామీలను విస్మరించి అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రంలో పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దేశహితం కోసం బీజేపీలో చేరాలని ఆయన కోరారు. అనంతరం ఖమ్మం కదనభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులు కూసంపూడి రవీంద్ర, వీరంరాజు భాస్కర్జి, నాగస్వామి, పాలకొల్లు శ్రీను, ఎస్.కే.రహీంతుల్లా, పర్సా రాంబాబు, మట్టా ప్రసాద్, మాడుగుల చిన్నికృష్ణ, సుదర్శన్ మిశ్రా, దొడ్డాపనేని కృష్ణయ్య, మధుసూదన్‌రావు పాల్గొన్నారు. అలాగే, తల్లాడలో జరిగిన జరిగిన సమావేశంలో ఖమ్మం సభ జనసేకరణ, ఏర్పాట్లపై పొంగులేటి సుధాకర్‌రెడ్డి నాయకులతో సమీక్షించారు. బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, తేజావత్ బాలాజీ నాయక్, రాయల రమేష్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ ఘోష్, నాయకులు

ఓటు హక్కు అమూల్యమైనది..

సత్తుపల్లిరూరల్: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అమూల్యమైనదని, 18ఏళ్లు నిండిన విద్యార్థులు తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని అసోం ఎమ్మెల్యే రామకృష్ణ ఘోష్ సూచించారు. సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఓటరు నమోదుపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారితో పాటు నంబూరి రామలింగేశ్వరరావు, కూసంపూడి రవీంద్ర, డీఎస్‌వీ.కృష్ణారెడ్డి, నల్లంటి వెంకటేశ్వరరావు, బలుసుపాటి సీతారాములు పాల్గొన్నారు.

సభావేదిక పరిశీలన


సభా ప్రాంగణంలో పరిశీలిస్తున్న సీపీ వారియర్, ఏసీపీ గణేష్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఆదివారం జరగనున్న సభ ఏర్పాట్లను బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై దీపక్‌రెడ్డితో చర్చించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామారావు, గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, బంగారు శృతి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, కట్టా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీ విష్ణు వారియర్ కూడా సభా వేదిక, ఏర్పాట్లను పరిశీలించి నగర ఏసీపీ గణేష్‌తో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

ప్రజా ఉద్యమాలను విస్తృతపర్చండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలను విస్తృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు, సీట్లు, సంపాదనే కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వారి ధ్యేయంగా మారిందని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈమేరకు ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. కాగా, వచ్చేనెల 10 నుంచి 19వ తేదీ వరకు ఖమ్మంలో జరిగే జన సేవాదళ్ జాతీయ శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు జానీమియా, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, శాఖమూరి శ్రీనివాసరావు, నూనె శశిధర్, సైదా, మోహన్‌రావు పాల్గొన్నారు.

నేటి సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ప్రత్యామ్నాయ పౌర సమూహం బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: మణిపూర్ మారణకాండ, ఉమ్మడి పౌరస్మృతి తదితర అంశాలపై ఖమ్మంలో శనివారం నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని ప్రత్యామ్నాయ పౌర సమూహం బాధ్యులు ఎంఎఫ్ గోపీనాథ్, మువ్వా శ్రీనివాసరావు, ఐవీ రమణారావు, పి.రవిమారుత్ కోరారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మణిపూర్‌లో నాలుగు నెలలుగా వివిధ తెగలపై సాగుతున్న మారణకాండను అరికట్టేందుకు పాలకులు సరిగ్గా స్పందించడం లేదని ఆరోపించారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే సభలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, ఆలిండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియం ధావలె, సామాజికవేత్త, అధ్యాపకురాలు కిమ్ కోవా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సభకు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో స్పర్శ భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు కలెక్టర్!

పిల్లలతో సహా వచ్చిన ప్రియాంక


కుమార్తెకు బొమ్మలు చూపిస్తున్న కలెక్టర్


కలెక్టర్ కుమారుడితో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తన కుమార్తె మైరా, కుమారుడు కియాన్‌తో శుక్రవారం కొత్తగూడెం 27వ వార్డు గాజుల రాజం బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చారు. సాధారణ తల్లి మాదిరిగానే పిల్లలను తీసుకొచ్చిన ఆమె అంగన్‌వాడీ టీచర్లను పరిచయం చేసుకుని పిల్లలతో కాసేపు అక్కడే గడిపారు. అందరితో పాటు నేలపై కూర్చుని పిల్లలను ఆడిస్తూ టీచర్ చెప్పిన పాఠాలను వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శైలజ, ప్రసన్నతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నెరవేరుతున్న ఏళ్ల కల

- ఈ నెల 28న ఇల్లెందులో బస్ డిపో ప్రారంభం
- హాజరుకానున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే హరిప్రియ


డిపో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, అధికారులు

ఇల్లెందు: ఆరు దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఈ నెల 28న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇల్లెందు శాటిలైట్ బస్ డిపోను ప్రారంభించనున్నారు. ఒకనాడు కనీస రవాణా సదుపాయాలు లేని ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో నేడు ఇల్లెందు పేరుతో బస్సులు తిరిగే దశకు చేరింది. ఈ బస్‌డిపోతో రాష్ట్రంలో ఇల్లెందుకు ఓ గుర్తింపు సంతరించుకోబోతోంది. శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆర్టీసీ అధికారులతో కలిసి బస్‌డిపోను సందర్శించి పరిశీలించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటల తర్వాత బస్ డిపో ప్రారంభోత్సవం జరగనున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇల్లెందు బస్ డిపో ఏర్పాటు కోసం ఆహర్నిశలు అధికారులు, మంత్రులతో చర్చించానని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో బస్‌డిపోను మంజూరు చేశారని, వేగంగా నిర్మాణం పూర్తి చేసినప్పటికీ బస్టాండ్ నుంచి బస్ డిపోలో ప్లాట్‌ఫాం సీసీ నిర్మాణం చేయాల్సి ఉందని, ఇందుకు రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. అటు ప్రారంభోత్సవం ఇటు సీసీ ప్లాట్ ఫాం నిర్మాణంకు శంకుస్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. ఇక నుంచి ఇల్లెందు నుంచి చుట్టు పక్కల గ్రామాలకు బస్‌రూట్లు పెరుగుతాయని, అదే క్రమంలో సుదూర ప్రాంతాలకు బస్సులు వెళ్లే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. ఇల్లెందు బస్‌డిపోను ఇక్కడి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

బస్సుల కేటాయింపు..

కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇల్లెందు డిపోకు 24 బస్సులు కేటాయించామని తెలిపారు. కొత్తగూడెం నుంచి 14, ఖమ్మం నుంచి 10 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ఇతర అధికారులతో కలిపి 100 మంది వరకు పనిచేసే అవకాశం ఉందన్నారు. పెట్రోల్ బంక్ కూడా త్వరలో వస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ కుమారస్వామి, మేనేజర్ అంకుషావలీ, ఆర్టీసీ, పీఆర్ అధికారులు భాస్కర్, అంజయ్య, సాగర్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇల్లెందు ఆర్టీసీ డిపోను ఖమ్మం ఆర్‌ఎం వెంకన్న కూడా పరిశీలించి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి


అభివాదం చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సెప్టెంబర్ 1న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు నాగిరెడ్డి, దుర్గాభవాని, సైదులు, సోమయ్య, మహబూబ్ అలీ మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించడమే కాక నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం పీఆర్‌సీ కమిటీ వేసి, నివేదిక వచ్చే వరకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఇంకా ప్రభుత్వం చొరవ తీసుకుని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్టీరింగ్ కమిటీ బాధ్యులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.విజయ్, యాదగిరి, ప్రసాదరావు, బుర్రి వెంకన్న, షమీ, నాగేశ్వరరావు, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, రాందాస్, ఉద్దండు షరీఫ్, మహేష్, మల్లయ్య, సురేష్, కల్యాణం నాగేశ్వరరావు, వెంగళరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన బ్యాగ్ అప్పగింత


బ్యాగ్ అందజేస్తున్న రైల్వే ఉద్యోగులు

మధిర: పొరపాటున రైలు నుంచి నుంచి జారిపడిన బ్యాగును వెతికి తీసుకొచ్చి బాధితుడికి అప్పగించిన రైల్వే ఉద్యోగులు భేష్ అనిపించుకున్నారు. ఏపీలోని ఏలూరుకు చెందిన ప్రయాణికుడు శుక్రవారం సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. పొరపాటున ఆయన బ్యాగు జారిపడగా, అందులో సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు ఉన్నాయని ఆయనరోదిస్తున్నాడు. అదేరైలులో మధిర చెందిన రైల్వే ఉద్యోగులు మోదుగు సైదులు, వెంకటేష్ ఆయనను మధిరలోదించారు. ఆతర్వాత ట్రాక్ వెంట నాలుగు కి.మీ. నడుస్తూ వెళ్లి నైట్ డ్యూటీ చేస్తున్న కమలాకర్ సాయంతో బ్యాగ్ వెతికి తీసుకొచ్చి స్టేషన్ మాస్టర్ నాగరాజు చేతుల మీదుగా అందజేయడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాగు దాటి వైద్యం

కాలినడకన వెళ్లిన వైద్యాధికారి, ఉద్యోగులు


గ్రామానికి వెళ్లేందుకు వాగు దాటుతున్న వైద్యాధికారి, ఉద్యోగులు

కరకగూడెం: మండలంలోని కరకగూడెం – చిరుమళ్ల మధ్య బ్రిడ్జి ఇటీవల భారీ వర్షాల కారణంగా కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఈ క్రమంలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు ఉద్యోగులతో కలిసి వాగు దాటి కాలినడకన వెళ్లి చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల, పాలకమ్మతోగు, రాయనపేట గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అలాగే, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, రహదారి సౌకర్యం లేకపోయినా పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు వైద్యశిబిరం ఏర్పాటు చేసిన వైద్యాధికారి, ఉద్యోగులకు స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం నర్సింహారావు, ఏఎన్‌ఎం పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం


నిందితుడితో ఎక్సైజ్ శాఖ అధికారులు

భద్రాచలం: భద్రాచలం మీదుగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో పాటు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు శుక్రవారం భద్రాచలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన వనం సాయి అనుమానాస్పదంగా కనిపించడంతో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఐదు కేజీల గంజాయి లభ్యమైంది. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసిన ఆయన వరంగల్‌కు చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో సీఐలు లతీఫ్, సర్వేశ్వర్, నాగేశ్వరరావు, రహీమున్నీసా, ఎస్‌ఐలు అనిల్, మురళి, గౌతమ్, మురళీకృష్ణ, రతన్ ప్రసాద్, సిబ్బంది కరీం, రామకృష్ణ, హబీబ్, అలీం, సుధీర్, హన్మంతరావు, వెంకట్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఆడుకుంటూ కారులోకి చిన్నారి

- ఊపిరి ఆడక నాలుగేళ్ల బాలుడు మృతి

కామేపల్లి(కారేపల్లి): నాలుగేళ్ల బాలుడు ఆడుకుంటూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారులో కూర్చోగా.. డోర్ లాక్ కావటంతో ఊపిరాడక మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రుక్కితండాకు చెందిన బానోతు అశోక్–అనూష దంపతులకు కుమారులు పార్థునాయక్, వర్షిత్ ఉన్నారు. వీరిని శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి పంపించిన తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. రోజులాగే మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రం పనివేళలు ముగిశాక ఆయా వచ్చి అశోక్ సోదరికి వీరిని అప్పగించి వెళ్లింది. ఈక్రమంలో వర్షిత్ నిద్రపోగా పార్థునాయక్(4) ఆడుకుంటూ బయటికి వెళ్లాడు. అప్పటికే ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న కారు తలుపు తీయగా తెరుచుకోవడంతో లోనకు వెళ్లాడు. ఆతర్వాత డోర్ లాక్ కావడంతో అందులోనే ఉండిపోయిన ఆయన ఊపిరి ఆడక అపస్మారక స్థితికి చేరాడు. ఎంతకూ బాలుడు రాకపోవడంతో బంధువులు గాలిస్తూ కారులో పరిశీలించగా పార్థునాయక్ అపస్మారక స్థితిలో ఉండడంతో అద్దాలు పగలకొట్టి ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లేలోగా మృతి చెందాడని తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

జ్వరంతో ఇంటర్ విద్యార్థిని మృతి

కామేపల్లి(కారేపల్లి): తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థిని చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన లకావత్ వస్రాం-బద్రి దంపతుల కుమార్తె నందిని(18) కారేపల్లి కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు వారం క్రితం జ్వరం రావటంతో ఈనెల 20వ తేదీన తల్లి బద్రికి ఫోన్ చేయగా హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించి తిరిగి కళాశాలలో పంపించి మరుసటి వెళ్లి చూడగా జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ తీసుకొచ్చి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. కాగా, కేజీబీవీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే తమ కుమార్తె మృతి చెందిందని, సమయానికి వైద్యం అంది ఉంటే ఇలా జరిగేది కాదని ఆమె తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

హెడ్ పోస్టాఫీస్‌లో పాము కలకలం


బంధించిన పాముతో వ్యక్తి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం హెడ్ పోస్టాఫీసులో శుక్రవారం పాము కలకలం రేపింది. రోజు మాదిరిగానే ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా మధ్యాహ్నం ట్రెజరీ ర్యాక్‌లో పాము ఉన్నట్లు మహిళా ఉద్యోగి గుర్తించారు. దీంతో ఉద్యోగులు, పోస్టు మాస్టర్ కిరణ్‌కుమార్ రెడ్డికి సమాచారం ఇవ్వగా అప్రమత్తమై పాములను ఆడించే ఓ వ్యక్తిని పిలిపించారు. దీంతో వచ్చి సుమారు ఏడు అడుగుల పొడవైనా పామును పట్టుకెళ్లారు. తపాలా కార్యాలయానికి ఆనుకొని పాత పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరడంతో అందులో నుంచి పాము వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపాన సదరు వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకోగా జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై సూచించారు.